దశలవారీగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్‌: నియోజకవర్గంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. హయత్‌నగర్ పరిధిలోని బాలాజీనగర్‌కాలనీ ఫేజ్–2లో నూతన కమ్యూనిటీహాల్ పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్డు పనులు చేపడుతామన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటికి పరిష్కరించటం జరిగిందని వివరించారు. కాలనీలో ఏర్పాటు చేసిన పార్కును త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, రుద్రయాదగిరి, ఆనంద్‌యాదవ్, కేకేఎల్‌గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాచకొండ జానయ్యగౌడ్, రాజుగౌడ్, సాయికొండల్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్

ఎల్‌బీనగర్: ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు రంగం సిద్ధం అయ్యిందని, అందులో భాగంగానే ఎల్ఆర్ఎస్ లబ్ధిదారులతో సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జీఓ 28 ప్రకారం గతంలో చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించనున్నట్లు ఆయన వెల్లడించారు. లే అవుట్‌లో 30 ఫీట్ల రోడ్డు, 10 శాతం ఓపెన్ ప్లేస్ ఉండాలని, ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దరఖాస్తుదారులు ఎల్ఎస్ఆర్ ఫీజు ముందే వసూలు చేయకుండా 10 శాతం వసూలు చేసి మిగతా 90 శాతం ఫీజు దరఖాస్తు పరిశీలించిన తర్వాత తీసుకోవాలని లబ్ధిదారుడు నర్సిరెడ్డి కోరగా స్పందించిన అధికారులు పరిశీలిస్తామన్నారు. ఓపెన్ ప్లేస్ ఫీజు 10 శాతం ఓనర్స్ నుంచి వసూలు చేయాలని కొంతమంది అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. లబ్ధిదారుల అభ్యంతరాలను పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ శ్రీనివాస్‌యాదవ్, రంజిత్‌కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సామ్సంగ్, ప్రతాప్, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

వరద సమస్య లేకుండా చేస్తాం

చైతన్యపురి: వరదనీటి కాలువ నిర్మాణంతో కాలనీలలో వేధిస్తున్న సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తున్నామని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. డివిజన్‌లోని ప్రభాత్‌నగర్ కాలనీ నుంచి గంగా ఆసుపత్రి రోడ్డు వరకు రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న వరదనీటి కాలువ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు తవ్వకాలు జరిపి అభివృద్ధి పనులు పూర్తి చేసిన వెంటనే రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు చేపడితే కాలనీ ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రత్నసాయి, స్థానిక నాయకులు రుద్రారపు శంకర్, వినోద్‌యాదవ్, నవీన్‌యాదవ్, కులదీప్, వెంకటరమణ, కాలనీవాసులు రాజగోపాల్, నర్సింహరావు, రవికుమార్, సతీష్, అంజయ్య పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం ఇస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

చైతన్యపురి: చైతన్యపురి రెండవ బస్టాప్ నుంచి ఎల్‌వీ టవర్స్ వరకు సివరేజీ లైన్ మంజూరు కాగా బాబు కాంప్లెక్స్ వరకే పనులు పూర్తయ్యాయని మిగిలిన 100 మీటర్ల లైన్ త్వరగా పూర్తి చేయాలని కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు వినతిపత్రం ఇచ్చినట్లు అధ్యక్షుడు మల్లే కృష్ణమూర్తి తెలిపారు. అసంపూర్తి పనులతో తరచూ రోడ్లపై డ్రైనేజీ నీరు ప్రవహిస్తుందని రోడ్డు నంబర్–18బీలో సివరేజీ లైన్ నుంచి మురుగునీరు బోర్‌వెల్ వాటర్‌లో కలిసి కలుషితమై అనారోగ్య బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే రోడ్డులో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అవసరమైన చోట్ల రబ్బర్ స్పీడ్ బ్రేక్స్ వేసేందుకు కాలనీ సంక్షేమ సంఘానికి అనుమతి ఇవ్వాలని కోరామన్నారు.

హాస్టల్ బాట పట్టిన జిల్లా అధికారులు

- సమస్యల పరిష్కారానికి విద్యార్థుల నిరసన
- త్వరలో కాస్మొటిక్ ఛార్జిలు, పెండింగ్ వేతనాలు అందిస్తామని హామీ

సాక్షి ఎఫెక్ట్..


జిల్లా సంక్షేమ అధికారిని సంధ్యారాణిని సమస్యలపై నిలదీస్తున్న విద్యార్థులు


సాక్షిలో ప్రచురితమైన కథనం

చంపాపేట: ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని పలు ప్రభుత్వ వికలాంగుల సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు లేక నానా ఇబ్బందులకు గురయ్యేవారు. హాస్టళ్ల సమస్యలపై గత నెల 24న సాక్షిలో 'సంక్షేమ హాస్టళ్లు..సమస్యల లోగిళ్లు' అనే శీర్షికత ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి, ఇన్‌చార్జి వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్‌నర్సు సారా శిరోమణి, సిబ్బంది సూర్య సోమవారం చంపాపేట ప్రభుత్వ వికలాంగుల సంక్షేమ హాస్టల్‌ను సందర్శించారు. విషయం తెలుసుకున్న హాస్టల్ విద్యార్థులు మౌలిక సదుపాయాలు కల్పించేంత వరకు కదిలేది లేదంటూ వికలాంగ విద్యార్థి పూల నాగరాజు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. నాలుగు దశాబ్దాల పురాతన భవనంలో ఉంటున్నామని గదుల ముందు నుంచే మురుగు పరుగు, కుంగిన బండలు, జెర్రిలు, ఈగలు, దోమలు, బొద్దింకలతో సహజీవనం చేస్తున్నా అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లైనా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకరం ఆహారం అందించాలనే విషయాన్ని తుంగలో తొక్కి మింగుడు పడని ముద్ద అన్నం, ఉడికీ ఉడకని కూరలు, నీళ్లచారుతో సరిపెడుతున్నారని అధికారులను నిలదీశారు. ఫైనాన్స్‌కు సంబంధించిన పనులను తాను చేపట్టలేనని సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని త్వరలో కాస్మోటిక్ చార్జీలు, బెడ్ షీట్లు, సిబ్బందికి పెండింగ్ వేతనాలు అందిస్తానని సంధ్యారాణి విద్యార్థులకు హామీ ఇచ్చారు. అయినప్పటికీ విద్యార్థులు ఆందోళన విరమించక పోవటంతో విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ సామ రమణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను సముదాయించటంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితీ సభ్యులు అందెరాంబాబు, రాంచందర్, నర్సింహ్మా, రాజు, అంజి, ఆంజనేయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా


అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణ దేవరాయనగర్‌కాలనీలో సోమవారం ఆయన అధికారులు, కాలనీవాసులతో కలిసి పర్యటించారు. కాలనీలో చెత్తకుప్పలు పేరుకపోతున్నాయని శానిటేషన్ అధికారులు చెత్తపై దృష్టి సారిండం లేదని, రోడ్లు, మంచినీటి పైప్‌లైన్లు, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు తదితర సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట వాటర్ వర్క్స్ డీజీఎం రాజగోపాల్, ఇంజినీరింగ్ ఏఈ రాజ్‌కుమార్, కాలనీ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సోమిరెడ్డి, నాయకులు శ్రీధర్‌రావు, మహేష్‌గౌడ్, శానిటేషన్ జవాన్ యాదయ్య, ఎస్ఎఫ్ఏ పురుషోత్తం, శ్రీకాంత్ ఉన్నారు.




ఎల్‌బీనగర్‌లో ఏర్పాటైన ఆక్సిజన్ పార్కు


పార్కుకు తాళం వేసిన దృశ్యం

పార్కు ప్రారంభంలో జాప్యమెందుకో?

కామినేని ఫ్లై ఓవర్ కింద పూర్తయిన ఆక్సిజన్ పార్కు

ఏడాదిన్నర గడుస్తున్నా అందుబాటులోకి రాని వైనం

మన్సూరాబాద్: రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యంతో ఓజోన్ పొర పల్చబడి, మానవాళి జీవితం ప్రశ్నార్థకమవుతుంది. పర్యావరణాన్ని కాపాడుకుని, ఓజోన్ పొరను పరిరక్షించుకునేందుకు ఆక్సిజన్‌ను విడుదల చేసే పార్కుల ఏర్పాటు ఎంతో అవసరమని ముందు చూపుతో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆక్సిజన్ పార్కుకు శ్రీకారం చుట్టారు. ఎల్‌బీనగర్‌లోని కామినేని ఫ్లై ఓవర్ల కింద దేశంలోనే మొట్టమొదటిగా ఆక్సిజన్ పార్కు ఏర్పాటైంది. అంతర్జాతీయ సంస్థ నాసా గుర్తించిన 38 రకాల ఆక్సిజన్‌ను అందించే మొక్కలను పార్కులో ఏర్పాటు చేశారు. పార్కు మధ్యలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి వాకర్స్‌కు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించాలనే ఉద్దేశంతో పార్కును ఏర్పాటు చేశారు.

ప్రారంభంలో జాప్యం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో నిరంతరం సమీక్ష చేపట్టి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి పార్కు నిర్మాణం పూర్తి చేశారు. ఆక్సిజన్ పార్కు నిర్మాణం పూర్తి చేసుకుని ఏడాదిన్నర కావస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పార్కు నిర్మాణం పూర్తయ్యింది. పార్కును త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు. ఎల్‌బీనగర్‌లోని కామినేని ఫ్లై ఓవర్ల కింద ఇరువైపుల ఉన్న స్థలంలో ఆక్సిజన్ పార్కును ఏర్పాటు చేశారు.

రాజకీయం కారణమా?

390 మీటర్ల స్థలంలో 734 మీటర్ల వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. 38 రకాల 34,329 మొక్కలను పార్కులో నాటారు. వాకర్లు కూర్చునేందుకు ప్రత్యేకంగా ఆకర్షనీయమైన బెంచీలు ఏర్పాటు చేశారు. సుమారు రూ.2 కోట్ల నిధులతో ఆక్సిజన్ పార్కు పనులు పూర్తిచేసి అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే పార్కు ప్రారంభానికి రాజకీయం చేస్తున్నారని సందర్శకులు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే పార్కుపై రాజకీయం చేయడం తగదని రెండు పార్టీల నాయకులు సమన్వయంతో పార్కు ప్రారంభానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

జాప్యం చేస్తున్నారు..



దేశంలోనే అత్యున్నత పార్కుగా ఆక్సిజన్ పార్కును రూపొందించాం . గత అసెంబ్లీ ఎన్నికల ముందు నిర్మాణం పూర్తయింది. ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభించలేకపోయాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ప్రారంభం గురించి ఊసే లేదు. పార్కును అందుబాటులోకి తీసుకు రావాలని పలుమార్లు అధికారులను కోరినా స్పందించడం లేదు. అధికార పార్టీ నేతలు అడ్డుపడి జాప్యం చేస్తున్నారు.

–సుధీర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే

వైఎస్సార్ పార్కుగా నామకరణ చేస్తాం



కామినేని ఫ్లై ఓవర్ కింద ఏర్పాటైన పార్కుకు వైఎస్సార్ ఆక్సిజన్ పార్కుగా నామకరణ చేస్తాం. జంక్షన్ అభివృద్ధి పనులు శరవేగంగా నడుస్తున్నాయి. అవి పూర్తి కాగానే జిల్లా ఇన్‌చార్జి మంత్రిచే ప్రారంభించి అందుబాటులోకి తెస్తాం. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆక్సిజన్ పార్కుకు వైఎస్సార్ పార్కు నామకరణానికి సహకరించి వైఎస్.రాజశేఖర్‌రెడ్డిపై తనకున్న చిత్తశుద్ధిని చాటుకోవాలి.

–జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి

ఎమ్మెల్యేకు వినతి

నాగోలు: కొత్తపేట డివిజన్ భారత్‌నగర్ కాలనీలో డ్రైనేజీ, రోడ్లు, కమ్యూనిటీ హాల్, తదితర సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మామిడి రామచందర్, ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటేష్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్డు నెంబర్ 6,7లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, కొత్త పైపులైన్లు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు నెంబర్ 1, 2,4 లల్లో డ్రైనేజీ పైపులైన్ల కోసం రోడ్లు తవ్వి అలాగే వదలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో లింగాల రాహుల్‌గౌడ్, మహేష్ రెడ్డి, తూర్పటి చిరంజీవి, మల్లేష్, పరశురాం, ప్రవీణ్ పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంక్షేమ సంఘం భవనానికి శంకుస్థాపన

ఎల్‌బీనగర్: స్వర్ణకారుల సంక్షేమం కోసం నిర్మిస్తున్న భవనం వారికి ఉపయోగపడేలా ఉండాలని అందుకు సంఘం ప్రతినిధులు పాటుపడాల్సిన అవసరం ఉందని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి అన్నారు. సెల్ఫ్‌ఫైనాన్స్ కాలనీలో నిర్మిస్తున్న స్వర్ణకారుల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి సోమవారం అరవిందరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహారావు, సుమన్‌గౌడ్, నక్క వెంకటస్వామి, రషీద్, చేపూరి శంకర్, బోయపల్లి శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కొగరి నరేష్, వెంకట్‌రెడ్డి, నిట్టు కృష్ణ, పి.కృష్ణ, పాపిపెడ్డి, వెంకటేశ్వర్లు, సాంబమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పేదలకేనా?


మాట్లాడుతున్న అందోజు రవీంద్రాచారి

హయత్‌నగర్: ప్రభుత్వ నిబంధనలు కేవలం పేదలకే వర్తిస్తాయా..? పెద్దలు తప్పు చేస్తే శిక్షలుండవు.. చర్యలుండవు.. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు తమ వైఖరిని స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు అందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. హయత్‌నగర్ మండల పరిధిలోని సర్వే నెంబర్ 255లో అసైన్డ్ భూములను పార్టీ ఎల్‌బీనగర్ కన్వీనర్ సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ.. హయత్‌నగర్ మండల పరిధిలోని అన్మగల్ సర్వే నెంబర్ 255లో 75 ఎకరాల భూమిని సాగు చేసుకునేందుకు ప్రభుత్వం పేద రైతులకు అసైన్డ్ చేసిందన్నారు. సదరు భూమిలో రైతులు తమ ఆర్థిక అవసరాలకు పేద, మధ్య తరగతి కుటుంబాలకు 40 నుంచి 70 గజాల వరకు విక్రయాలు చేశారు. కొనుగోలు చేసిన పేదలను తమ ప్లాట్లలోకి వెళ్లనివ్వకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇదే సర్వే నెంబర్‌లో పలుకుబడి ఉన్న నేతలు స్థలాలను కొనుగోలు చేశారని, వాళ్లను రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతూ పేదల కొనుగోలు చేసిన స్థలాలకు నిబంధనలు అంటూ అడ్డుకుంటున్నారని విమర్శించారు. పేదలకు అండగా ఉంటూ న్యాయం జరిగే వరకు సీపీఐ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహా, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సొంత ఖాతాలోకి మళ్లింపు

రూ. 15 లక్షలు కాజేసిన తాత్కాలిక ఉద్యోగి సస్పెన్షన్

సైదాబాద్: విద్యుత్ వినియోగదారులు చెల్లించిన బిల్లుల సొమ్మును తన అవసరాలకు వాడుకున్న తాత్కాలిక ఉద్యోగిని ట్రాన్స్‌కో అధికారులు సస్పెన్షన్ చేశారు. ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ఆర్టిజన్ (తాత్కాలిక ఉద్యోగి)గా విధులు నిర్వహిస్తున్న రత్నారెడ్డి గడ్డిఅన్నారంలోని మధురానగర్‌లోని పలు ప్రైవేట్ వసతి గృహాల నిర్వాహకులతో కుమ్మక్కై విద్యుత్ బిల్లులు ఆలస్యంగా చెల్లించినా వారి కనెక్షన్లు తొలగించకుండా ఉండేవాడు. ఇదే అదనుగా చేసుకున్న రత్నారెడ్డి కొన్ని నెలలుగా వారు చెల్లించాల్సిన బిల్లులను తన సొంత ఖాతాలోకి వేయించుకున్నాడు. అయితే వారి బిల్లుల బకాయిలు పెరిగిపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు వారి కనెక్షన్లను తొలగించడంతో రత్నారెడ్డి తమను మోసగించినట్లు నిర్వాహకులు తెలిపారు. వారి నుంచి రత్నారెడ్డి సుమారు రూ. 15 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. డీఈ విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. అక్రమాలకు పాల్పడిన రత్నారెడ్డిని సస్పెన్షన్ చేశామన్నారు. ఆయా ప్రైవేట్ వసతి గృహాల నిర్వాహకులు బకాయిలు చెల్లించిన తర్వాతే కనెక్షన్లు పునరుద్ధరిస్తామన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్లలో టార్గెట్ రూ.193.14 కోట్లు, వసూలైంది రూ. 139.53 కోట్లు




ఎల్‌బీనగర్: ఆస్తిపన్ను చెల్లింపు గడువు ఈ నెలాఖరు వరకు ముగియనుంది. ఇందుకోసం అధికారులు తమ టార్గెట్‌ను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. మూడు సర్కిళ్ల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.193.14 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ. 139.53 కోట్లు వసూలైంది. మిగతా వసూళ్లపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది వ్యాపారా లావాదేవీలు సరిగా లేకపోవడం అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారో లేదో అనే సందేహం వ్యక్తమవుతోంది. తమ టార్గెట్‌లను పూర్తి చేసేందుకు మూడు సర్కిళ్ల డీసీలు ట్యాక్స్ అధికారులతో రోజు వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గత రెండు నెలల వ్యవధిలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సమగ్ర కుటుంబ సర్వేపై అధికారులు పాల్గొనడంలో ఆస్తిపన్ను వసూళ్లపై అంతగా దృష్టి సారించలేకపోయారు.

సర్కిళ్ల వారీగా వివరాలు..

- ఎల్‌బీనగర్ సర్కిల్–3 పరిధిలో 8 డాకెట్లు ఉండగా గతేడాది 48,554 అసెస్‌మెంట్లు ఉండగా వసూలైంది రూ.74.38 కోట్లు. ఈ ఏడాది టార్గెట్ రూ.77.13 కోట్లు నిర్దేశించగా ఇప్పటి వరకు వసూలైంది రూ.53.32 కోట్లు.
- సర్కిల్–4లో 8 డాకెట్లు ఉండగా ఇందులో సుమారుగా ఆస్తి పన్నులు చెల్లించిన వారి ఇళ్లు 34,412 ఉన్నాయి. గతేడాది వీరు చెల్లించిన ఆస్తి పన్ను రూ. 50.18 కోట్లు. ఈ సంవత్సరం ఈ సర్కిల్ అధికారుల టార్గెట్ రూ. 52.93 కోట్ల ఉండగా ఇప్పటి వరకు వసూలైంది రూ. 41 కోట్లు.
- సర్కిల్–5లో 12 డాకెట్లు ఉండగా ఇందులో ఆస్తి పన్ను చెల్లించే వారు సుమారుగా 48,485 మంది ఉన్నారు. గత సంవత్సరం ఈ సర్కిల్ పరిధిలో వసూలైంది రూ. 60.33 కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరం టార్గెట్ రూ. 63.08 కోట్లు ఉండగా ఇందులో ఇప్పటి వరకు వసూలైంది రూ. 45.21 కోట్లు మాత్రమే.
- టార్గెట్‌ను చేరుకునేందుకు అధికారులు మూడు సర్కిళ్ల పరిధిలో మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసులు జారీ చేసిన పన్నులు చెల్లించకుంటే వారం రోజుల గడువులో వారి ఆస్తులను సీజ్ చేయడంతో పాటు జప్తు చేసేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

టార్గెట్‌ను చేరుకుంటాం..



ఈ ఆర్థిక సంవత్సరం తమ టార్గెట్‌ను పూర్తి చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం . రోజు వారీగా సమీక్షా సమావేశాలు, వసూళ్లపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతున్నాం. మొండి బకాయిదారులకు ముందుగా రెడ్ నోటీసులు జారీ చేస్తున్నాం. స్పందించకుంటే ఆస్తులు జప్తు చేస్తాం.

–డాక్టర్ తిప్పర్తి యాదయ్య, ఎల్‌బీనగర్ సర్కిల్–3 డీసీ

అరుణాచలగిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

చైతన్యపురి: తమిళనాడులోని అరుణాచలగిరి ప్రదక్షిణకు దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ నెల 12న రాత్రి 7.15 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బయలుదేరి కాణిపాకం, గోల్డేన్ టెంపుల్ మీదుగా అరణాచలం చేరుకుంటుందని తెలిపారు. 14న మధ్యాహ్నం బయలు దేరుతుందని ఒకొక్కరికి టికెట్ రూ. 3900 ఉంటుందని బుకింగ్ కోసం టీజీఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా లేదా 9959226249, 9346559649, 9666350995 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధి హైకోర్టు కాలనీలోని వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో స్వామి వారి షష్ఠమ వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం నుంచి గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బి.శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు పి.వెంకటేశ్వర రావు, కార్యదర్శి టి.నాగరాజు, కోశాధికారి బి.సత్యనారాయణమూర్తి తెలిపారు. మూడ్రోజుల పాటు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.32, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.19, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.20, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.23, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.45, మునగ రూ.55, కందగడ్డ రూ.65, బీట్‌రూట్ రూ.15, కీర రూ.23, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.32. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ


ప్రజావాణిలో పాల్గొన్న డీసీ సుజాత

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రధానంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన ఫిర్యాదులే అధికంగా రావడం విశేషం.ఐదు సర్కిళ్ల పరిధిలో 13 ఫిర్యాదులు రాగా టౌన్ ప్లానింగ్ విభాగంలోనే 5 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. మిగతా వాటిలో ట్యాక్స్ విభాగంలో 5, శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాలపై ఒక్కొక్కటి వచ్చాయన్నారు. ఫిర్యాదులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి


సిబ్బందికి సూచనలు చేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: డివిజన్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం వార్డు కార్యాలయంలో ఆయన ఎంటమాలజీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి యాంటీలార్వాపై అవగాహన కల్పించాలన్నారు. కాలనీలలో ఎప్పటికప్పుడు పిచికారీ చేయాలని సూచించారు. సరూర్‌నగర్ చెరువులోకి గుర్రపు డెక్క రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంటమాలజీ ఏఈ మానమ్మ, సిబ్బంది, పాల్గొన్నారు.

అన్నదానం

వనస్థలిపురం: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం నిర్వహించడం అభినందనీయమని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమ వారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో వాసవి క్లబ్ వనస్థలిపురం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్లబ్ ప్రతినిధులు మల్లికార్జునరావు, శివనాగేశ్వర్‌రావు, విట్టా దూరయ్య, మురళీధర్‌గుప్త, రాములు, శ్రీనివాసులు, సాయిమోహన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పేకాడుతున్న 9 మంది అరెస్టు

నాగోలు: పేకాట ఆడుతున్న 9 మందిని నాగోలు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై రమేష్ వివరాల ప్రకారం.. బండ్లగూడలోని రాజీవ్ స్వగృహ సహభావన అపార్ట్‌మెంట్ సీ– బ్లాక్‌లోని 902 ఫ్లాట్ లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి దాడిచేసి 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.74 వేల నగదు, 9 ఫోన్లను స్వాధీనం చేసుకుని ఉప్పల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.